సాక్షి
అనంతపురం
మంగళవారం । 25 । మార్చి । 2025




చీనీ టన్ను రూ.24,120

అనంతపురం మార్కెట్‌యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.24,120 పలికాయి.



టమాట కిలో రూ.7

అనంతపురం కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్ట ధర రూ.7 పలికింది. కనిష్టం 5, సరాసరి రూ.6 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



న్యూస్‌రీల్

కోమాలోకి వెళ్లేలా చితకబాదారు

- వ్యక్తిపై పెద్దపప్పూరు ఎస్‌ఐ దాష్టీకం



నారాయణరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి

తాడిపత్రిటౌన్: ఓ వ్యక్తిపై పెద్దపప్పూరు ఎస్‌ఐ దాష్టీకం ప్రదర్శించారు. స్టేషన్‌కు రప్పించి విచక్షణా రహితంగా కర్రలతో చితకబాదారు. దీంతో బాధితుడు స్పృహ తప్పి కోమాలోకి వెళ్లాడు. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలు.. పెద్దపప్పూరు మండలం చిక్కేపల్లి గ్రామానికి చెందిన నారాయణరెడ్డి, జగన్నాథరెడ్డిలు ఇంటి వద్ద రహదారి విషయమై వారం రోజులుగా వాదులాడుకున్నారు. జగన్నాథరెడ్డి ఫిర్యాదు మేరకు ఆదివారం నారాయణరెడ్డితో పాటు అతని సోదరుడు రామేశ్వరెడ్డిని పెద్దపప్పూరు ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ స్టేషన్‌కు పిలిపించారు. ఇద్దరినీ చితకబాదారు. ఎస్‌ఐ దెబ్బలకు తట్టుకోలేక నారాయణరెడ్డి స్పృహ తప్పి కూలిపోయాడు. అయినా, సాయంత్రం వరకు ఇద్దరినీ స్టేషన్‌లోనే ఉంచుకుని రాత్రి ఇంటికి పంపించారు.ఇంటికి చేరుకున్న నారాయణరెడ్డి ఉలుకుపలుకూ లేకుండా పడిపోవడంతో కంగారు పడిన కుటుంబసభ్యులు వెంటనే తాడిపత్రి ఆసుపత్రికి తీసుకెళ్లారు. అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని ఓ ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు.

మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి పరామర్శ..

విషయం తెలుసుకున్న తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి సోమవారం ఆసుపత్రికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. సంఘటనపై ఆరా తీశారు. ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు. బాధితునికి న్యాయం జరిగే వరకూ పోరాడతామని హామీ ఇచ్చారు.

పండ్ల పక్వానికి కార్బైడ్ వాడకుండా చూడండి

- జేసీ శివ్‌నారాయణ్ శర్మ

అనంతపురం సెంట్రల్: ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే కార్బైడ్‌ను పండ్ల పక్వానికి వాడకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ ఆదేశించారు.సోమవారం రెవెన్యూభవన్‌లోని ప్రత్యేక చాంబర్‌లో వైద్య, ఆరోగ్య, మార్కెటింగ్, రవాణా, వ్యవసాయశాఖ, అగ్రికల్చర్, హార్టికల్చర్ అధికారులతో వేర్వేరుగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. కాల్షియం కార్బైడ్, ఇతరత్రా హానికరమైన రసాయనాల వాడకం నిషేధించినట్లు తెలిపారు. వీటి వాడకం వలన కలిగే దుష్ప్రభావాలపై వ్యాపారులు, రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ విషయంపై పర్యవేక్షణకు జాయింట్ కలెక్టర్ చైర్మన్‌గా, మెడికల్ అండ్ హెల్త్, ఆహార భద్రత, జిల్లా పంచాయతీ అధికారి, ఉద్యాన శాఖ, రవాణాశాఖ అధికారులతో ప్రత్యేకంగా జిల్లా కమిటీ ఏర్పాటు చేసినట్లు వివరించారు. వేసవి సీజన్‌లో మార్చి నుంచి జూలై వరకూ పండ్లు మార్కెటింగ్‌కు వస్తాయని, కాల్షియం కార్బైడ్ వినియోగాన్ని పూర్తిగా నియంత్రించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపరవాణా కమిషనర్ వీర్రాజు, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ కళ్యాణచక్రవర్తి, మార్కెటింగ్ ఏడీ సత్యనారాయణ చౌదరి, డీపీఓ నాగరాజనాయుడు, ఫుడ్ సేఫ్టీ అధికారి తస్లీమా, వ్యవసాయ, ఉద్యాన, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

- అనంతపురంలోని శ్రావణి ఫర్టిలైజర్స్ యజమాని నకిలీ కళింగర విత్తనాలు ఇవ్వడంతో పంట సర్వస్వం కోల్పోయిన బత్తలపల్లి మండలం డి.చెర్లోపల్లె రైతు మురళి వారం రోజుల క్రితం షాపు దగ్గరే పురుగుల మందు తాగాడు. స్థానికులు తక్షణమే ఆస్పత్రికి చేర్చడంతో బతికి బయటపడ్డాడు. ఇంత జరిగినా ఫర్టిలైజర్స్ యజమానిపై ఇప్పటికీ చర్యలు లేవు.

- రెండు రోజుల క్రితం ఈదురుగాలులు, అకాల వర్షానికి యల్లనూరు మండలం నీర్జాంపల్లికి చెందిన చిన్న వెంగప్ప తొమ్మిది ఎకరాలు, లక్ష్మీనారాయణ పదిన్నర ఎకరాల్లో సాగు చేసిన అరటి పంటలు దెబ్బతిన్నాయి. వ్యవసాయాధికారులకు ఫోన్ చేసి ఇలా జరిగిందని చెప్పగా స్పందించలేదు. దీంతో బాధితులు పురుగుల మందు తాగారు. ప్రస్తుతం అనంత సర్వజనాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.



అకాల వర్షాలకు యల్లనూరు మండలం నీర్జాంపల్లిలో తీవ్రంగా దెబ్బతిన్న అరటి తోట

ఇలాగైతే రైతు బతికేదెట్టా?!

- ఉమ్మడి జిల్లాలో దారుణంగా రైతన్నల పరిస్థితి
- నకిలీ విత్తనాలు, ప్రకృతి వైపరీత్యాలతో చితికిపోతున్న అన్నదాతలు
- రెండు రోజుల క్రితం ఈదురుగాలుల బీభత్సంతో తీవ్ర నష్టం
- మాజీ సీఎం వైఎస్ జగన్ పర్యటన అనంతరం హడావుడిగా మంత్రి సవిత పొలాల వద్దకు..
- ఇప్పటికీ ఎమ్మెల్యేలకు మద్యం అమ్మకాలపైనే శ్రద్ధ

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో విపత్కర పరిస్థితులు నెలకొన్నాయి. పట్టెడన్నం పెట్టే రైతన్నకు పుట్టెడు దుఃఖమే మిగులుతోంది. అధికారుల వద్దకు రైతులు పురుగు మందు బాటిళ్లతో వెళ్తుండటం ఇక్కడి దారుణ పరిస్థితులకు అద్దం పడుతోంది. 'మేం అధికారంలోకి రాగానే ప్రతి రైతుకు రూ.20 వేలు సాయం చేస్తాం.. రైతును రాజు చేస్తాం' అంటూ బీరాలు పలికిన 'కూటమి' నేతలు పత్తా లేకుండా పోయారు.

నకిలీ విత్తనాలు.. అకాల వర్షాలు

రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుంటున్న కొందరు ఫర్టిలైజర్స్ షాపు నిర్వాహకులు నకిలీ విత్తనాలు కట్టబెడుతున్నారు. దీంతో పంట చేతికి అందక అన్నదాతలు లబోదిబోమంటున్నారు. అప్పటికే పెట్టుబడులు రూ.లక్షలైన నేపథ్యంలో దుఃఖంలో కూరుకుపోతున్నారు. ఒక వేళ పంట బాగుందనుకున్నా.. చివరి దశలో ప్రకృతి వైపరీత్యాలు నిండా ముంచేస్తున్నాయి. రెండు రోజుల క్రితం అకాల వర్షానికి జిల్లా వ్యాప్తంగా వందల ఎకరాల్లో అరటి, దోస (కర్బూజా) తోటలు నాశనమయ్యాయి. కోతకు సిద్ధంగా ఉన్న పంటలు ఒక్కసారిగా తుడిచిపెట్టుకుపోవడంతో అన్నదాతల ఆవేదన అంతా ఇంతా కాదు.



పురుగుల మందు తాగి ఆస్పత్రిలో చేరిన బత్తలపల్లి మండలం చెర్లోపల్లికి చెందిన రైతు మురళి (ఫైల్)

ముగ్గురు మంత్రులున్నా..

గత సర్కారు హయాంలో పంట నష్టం జరిగితే మంత్రులు లేదా ఎమ్మెల్యేలు, అధికారులు వెంటనే బాధిత రైతుల దగ్గరికి వెళ్లేవారు. కానీ ఇప్పుడా పరిస్థితి లేదు. ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి ముగ్గురు మంత్రులున్నా వాళ్లు ఎక్కడున్నారో తెలియదు. అయితే, వైఎస్సార్ జిల్లా పులివెందుల నియోజకవర్గంలోని లింగాల మండలంలో పంట నష్టాన్ని పరిశీలించడానికి మాజీ సీఎం వైఎస్ జగన్ వెళ్లారని తెలుసుకున్న మంత్రి సవిత హడావుడిగా యల్లనూరు మండల పర్యటన చేయడం గమనార్హం.

మద్యం ఆదాయమే ముఖ్యం..

జిల్లాలో 150 వరకూ మద్యం షాపులు ఉన్నాయి. వీటిలో 85 శాతం షాపులు ఎమ్మెల్యేలు, వారి అనుచరులవే. 'రైతులు ఎటైనా పోనీ మా మద్యం వ్యాపారం బాగా జరిగిందా లేదా' అన్నదే వీరి విధానంగా మారింది. పర్మిట్ రూములు, బెల్టుషాపులతో నిత్యం కోట్ల రూపాయల వ్యాపారం చేస్తున్న ఎమ్మెల్యేలు... రైతన్నలను పట్టించుకున్న పాపాన పోవడం లేదు.

ప్రభుత్వం విఫలం

రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ప్రభుత్వ మాజీ సలహాదారు(విద్య) ఆలూరి సాంబశివారెడ్డి పేర్కొన్నారు. సర్వజనాస్పత్రిలో చికిత్స పొందుతున్న రైతులు లక్ష్మీనారాయణ, చిన్న వెంగప్పను ఆయన పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో మాట్లాడారు. చేతికొచ్చిన పంట దెబ్బతినడంతో రైతులు ఆత్మహత్యాయత్నం చేశారన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎప్పటికప్పుడు నష్ట పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకున్నారన్నారు. ఇప్పుడీ పరిస్థితి లేదన్నారు.

రైతులకు అండగా ఉంటాం

రైతులకు సీపీఐ ఎప్పుడూ అండగా ఉంటుందని పార్టీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పేర్కొన్నారు. ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో చికిత్స పొందుతున్న రైతులు లక్ష్మీనారాయణ, చిన్న వెంగప్పలను ఆయన పరామర్శించారు. పంట నష్టం జరిగిందని ఎవరూ అఘాయిత్యాలు చేసుకోవాల్సిన పనిలేదన్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చైనా న్యాయం చేస్తామన్నారు.



రైతులను పరామర్శిస్తున్న ఆలూరి సాంబశివారెడ్డి

కొండంత ఆశ ఆవిరైంది



"నాకున్న ఐదెకరాల్లో 6 వేల అరటి మొక్కలను నాటా. మొదటి కోత త్వరలోనే కోయాల్సి ఉంది. రూ.8 లక్షలు పెట్టుబడి పెట్టా. పంట చేతికొస్తే అప్పులు తీరుతాయని కొండంత ఆశ ఉండేది. రెండు రోజుల క్రితం కురిసిన అకాల వర్షాలకు తోటలోని పంట తీవ్రంగా దెబ్బతింది. రూ.20 లక్షల నష్టం వాటిల్లింది. ప్రభుత్వమే ఆదుకోవాలి. పరిహారం తక్షణమే అందిస్తే ధైర్యంగా ఉంటుంది.

– రాజా, నీర్జాంపల్లి,యల్లనూరు మండలం

భవిష్యత్తు కోల్పోయాం



ఎనిమిది ఎకరాల్లో 10 వేల అరటి మొక్కలు సాగు చేశా. మొదటి కోతకు రాగానే అకాల వర్షం, వడగండ్ల వానకు కాయలు మొత్తం మచ్చలు వచ్చేశాయి. పంటను వ్యాపారులు కొనరు. దీంతో రూ.30 లక్షల వరకు నష్టం వస్తుంది. భవిష్యత్తును కోల్పోయా.

– జయప్రకాష్‌నాయుడు, కూచివారిపల్లి, యల్లనూరు మండలం


ఆత్మహత్యలే శరణ్యం



ఒకటిన్నర పొలంలో టమాట పంట సాగు చేశా. రూ.80 వేల వరకు పెట్టుబడి పెడితే కేవలం రూ.35 వేలు చేతికందింది. ప్రభుత్వం టమాట పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి. రైతులను ఆదుకునేందుకు ప్రత్యేక చొరవ చూపాలి. లేదంటే ఆత్మహత్యలే శరణ్యం.

–నాగభూషణ, కలిమిగొలిమి, కుందుర్పి మండలం

అంతులేని ఆవేదనలో అన్నదాతలు



అనంతపురం కార్పొరేషన్: వడగండ్ల వాన, ఈదురు గాలులతో పంటలు దెబ్బతిని ఉద్యాన రైతులు అంతులేని ఆవేదనలో మునిగిపోయారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. తాడిపత్రి, శింగనమల నియోజకవర్గాల్లో అరటి, మొక్కజొన్న, దానిమ్మ, బొప్పాయి తదితర ఉద్యాన పంటల రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. రూ.35 కోట్లకుపైగా నష్టం జరిగిందన్నారు. అప్పులు చేసి పంటలు సాగు చేస్తే చేతికందాల్సిన పంట నేలనంటడంతో అన్నదాతల ఆవేదన అంతా ఇంతా కాదన్నారు. ఫిబ్రవరిలో అరటి టన్ను రూ.25,000 వరకు ఉంటే ప్రస్తుతం ధరలు పడిపోయాయని తెలిపారు. ఇలాంటి తరుణంలో పెట్టుబడులు కూడా దక్కే సూచనలు కన్పించడం లేదన్నారు. అధికార యంత్రాంగం సమగ్రంగా నష్టం అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపాలన్నారు. యల్లనూరు మండలం నీర్జాంపల్లికి చెందిన అరటి రైతులు లక్ష్మీనారాయణ, చిన్న వెంగప్ప ఆత్మహత్యకు యత్నించడం బాధాకరమని, ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో చికిత్స పొందుతున్న వారికి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఎన్నికల సమయంలో పెట్టుబడి సాయంగా రూ.20,000 ఇస్తామని చెప్పిన చంద్రబాబు.. తీరా అధికారంలోకి వచ్చాక తొలి ఏడాది పెట్టుబడి సాయం కూడా అందించలేదన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో అమలు చేసిన ఉచిత పంట బీమా పథకం రైతాంగాన్ని ఆదుకుందని, అలాంటి పథకానికి చంద్రబాబు ప్రభుత్వం మంగళం పాడిందని విమర్శించారు.

ప్రతి రైతునూ ఆదుకుంటాం



రైతులతో మాట్లాడుతున్న మంత్రి సవిత

యల్లనూరు: అకాల వర్షాలకు నష్టపోయిన ప్రతి రైతునూ ఆదుకుంటామని మంత్రి సవిత అన్నారు. సోమవారం నీర్జాంపల్లి, గొడ్డుమర్రి గ్రామాల్లో ఈదురుగాలులకు పడిపోయిన అరటి చెట్లను మంత్రి పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. నష్ట అంచనాలను తయారు చేసి ప్రభుత్వానికి నివేదికలు పంపుతామని, పరిహారం అందేలా ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి సమస్యను తీసుకెళ్తామన్నారు. అంతకుముందు అనంతపురం సర్వజనాస్పత్రిలో చికిత్స పొందుతున్న రైతులు లక్ష్మీనారాయణ, చిన్న వెంగప్పను మంత్రి పరామర్శించారు. కార్యక్రమంలో జేసీ శివ్ నారాయణ్ శర్మ, ఆర్డీఓ కేశవనాయుడు, జిల్లా ఉద్యాన అధికారి నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.

పరిష్కార వేదిక కిటకిట

- ఇతని పేరు టి.గోవిందప్ప. కుందుర్పి మండలం మహంతపురం గ్రామం. 2017 సంవత్సరంలో కుందుర్పి కెనరా బ్యాంక్‌లో రూ.12 వేల పంట రుణం తీసుకున్నాడు. 2020లో రుణం మొత్తం వడ్డీతో కలిపి చెల్లించాడు. కానీ, ఐదేళ్లవుతున్నా ఇప్పటికీ పాసుపుస్తకం ఇవ్వలేదు. ఇదేమని ప్రశ్నిస్తే... 'నీ ఇష్టం వచ్చిన చోట చెప్పుకో ఇవ్వను' అంటూ మేనేజర్ దురుసుగా మాట్లాడుతున్నాడు. దీంతో సమస్యను కలెక్టర్‌కు చెప్పుకునేందుకు గోవిందప్ప సోమవారం కలెక్టరేట్‌కు వచ్చాడు.





అర్జీలు స్వీకరిస్తున్న జేసీ శివ్ నారాయణ్ శర్మ

అనంతపురం అర్బన్: కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో సోమవారం నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' అర్జీదారులతో కిటకిటలాడింది. ప్రజల నుంచి జేసీ శివ్ నారాయణ్ శర్మతో పాటు డీఆర్‌ఓ ఎ.మలోల, డిప్యూటీ కలెక్టర్లు రామకృష్ణారెడ్డి,ఆనంద్,రమేష్‌రెడ్డి,తిప్పేనాయక్‌లు అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై 419 వినతులు అందాయి. కార్యక్రమం అనంతరం అర్జీల పరిష్కారంపై అధికారులతో జేసీ సమీక్షించారు. సమస్యకు నాణ్యమైన పరిష్కారం చూపాలని సూచించారు. అకాల వర్షాలతో దెబ్బతిన్న ఉద్యాన పంటలకు సంబంధించి నివేదికలు త్వరితగతిన సిద్ధం చేయాలని ఆదేశించారు.

వినతుల్లో కొన్ని..

- వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకుని రెండేళ్లవుతున్నా ట్రాన్స్‌ఫార్మర్ వైరు ఇవ్వలేదని గుంతకల్లు మండలం కొంగనపల్లికి చెందిన పి.రంగన్న ఫిర్యాదు చేశాడు. పరిష్కారం చూపాలని కోరాడు.
- పింఛను మంజూరు చేయాలంటూ కళ్యాణదుర్గం మారెంపల్లి కాలనీకి చెందిన షేక్ చాంద్ బీబీ విన్నవించింది. ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారని, పనిచేయడానికి కూడా ఆరోగ్యం సహకరించని తనకు పింఛను మంజూరు చేయించి ఆదుకోవాలని కోరింది.
- తమకు చెందాల్సిన భూమిని వేరొకరి పేరున పాసుపుస్తకాలు ఇచ్చారని అనంతపురం రామ్ నగర్‌కు చెందిన పి.రామచంద్ర ఫిర్యాదు చేశాడు. అనంతపురం రూరల్ మండలం ఆలమూరు గ్రామ పొలం సర్వే నంబరు 116లో 1.08 ఎకరాల భూమి తండ్రి ద్వారా తమకు చెందాల్సి ఉన్నా.. ఇతరుల పేరున పాసు పుస్తకాలు ఇచ్చారన్నాడు. న్యాయం చేయాలని కోరాడు.

భార్యపై హత్యాయత్నం.. భర్తకు పదేళ్ల జైలు

అనంతపురం/పుట్టపర్తి టౌన్: భార్యను వేధించడంతో పాటు హత్య చేసేందుకు యత్నించిన భర్తకు 10 సంవత్సరాల జైలు శిక్ష పడింది. ఈ మేరకు అనంతపురం నాలుగో జిల్లా కోర్టు న్యాయమూర్తి శోభారాణి సంచలన తీర్పు వెలువరించారు. వివరాలు.. శ్రీ సత్యసాయి జిల్లా ముదిగుబ్బ మండలం పాడరాళ్లపల్లి గ్రామానికి చెందిన కిష్టప్ప కుమారుడు చాకలి రాజశేఖర్‌కు, పుట్టపర్తి మండలం వెంకటగారి పల్లికి చెందిన చాకలి సావిత్రికి 2016లో వివాహమైంది. దంపతులిద్దరూ ముదిగుబ్బలో కాపురం పెట్టారు. ఆరు నెలల్లోనే సావిత్రిపై రాజశేఖర్ అనుమానం పెంచుకున్నాడు. చంపుతానని బెదిరించేవాడు. వేధింపులు తట్టుకోలేక సావిత్రి పుట్టింటికి వెళ్లిపోగా.. అక్కడికే వెళ్లిన రాజశేఖర్ ఆమెను కొట్టడమే కాకుండా తండ్రి ఓబులేసు ఫోన్ తీసుకెళ్లిపోయాడు. ఈ క్రమంలోనే 2017 అక్టోబర్ 11న మధ్యాహ్నం 3 గంటల సమయంలో భార్యకు ఫోన్ చేసి.. తాను అరటి కాయల లోడుకు వెళ్తున్నానని, వెంకటగారిపల్లి క్రాస్ వద్దకు వస్తే సెల్‌ఫోన్ ఇస్తానన్నాడు. అక్కడికి సావిత్రి వెళ్లగా.. కంపచెట్లలో కత్తితో దాక్కుని ఉన్న రాజశేఖర్ ఉన్నపలంగా ఆమెపై దాడికి పాల్పడ్డాడు. ఎడుమ భుజం వెనుక, కుడిపక్క గొంతు కింద రెండు పోట్లు పొడిచాడు. అంతలోనే సావిత్రి అక్క కుమారుడు సాయి కృష్ణ, అతని స్నేహితుడు సాయి కుమార్, బావ రాము రావడం చూసి పారిపోయాడు. గాయపడిన సావిత్రిని వెంకటగారి పల్లి సర్పంచ్ చిన్న రామప్ప 108లో పుట్టపర్తి సూపర్‌స్పెషాలిటీకి తరలించారు. దీనిపై బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి చార్జిషీట్ దాఖలు చేశారు. కేసు పూర్వాపరాలు విచారించిన న్యాయమూర్తి శోభారాణి సోమవారం తీర్పు వెలువరించారు. ముద్దాయి రాజశేఖర్‌కు 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.5 వేల జరిమానా విధించారు. ప్రాసిక్యూషన్ తరపున సుజన వాదనలు వినిపించారు.

కబ్జాకోరులకు చెంపదెబ్బ

- విద్యారణ్యనగర్‌లోని 68 సెంట్ల స్థలంపై కోర్టు స్టేటస్ కో
- మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: అనంతపురం రూరల్ మండలం పాపంపేట 106-1 సర్వే నంబరు విద్యారణ్యనగర్‌లోని 68 సెంట్లలో పేదల ఇళ్ల కూల్చివేత కేసులో స్టేటస్ కో ఇచ్చి కబ్జాకోరులకు న్యాయ దేవత చెంపదెబ్బ కొట్టిందని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 68 సెంట్లలో ఎలాంటి నిర్మాణాలు చేయకూడదని, లావాదేవీలు, ఆన్‌లైన్ రికార్డుల్లో ఎలాంటి మార్పులు జరగకూడదని, రిజిస్ట్రేషన్లు చేయకూడదని కోర్టు స్పష్టం చేసిందన్నారు. ల్యాండ్ గ్రాబింగ్ చట్టానికి సంబంధించి షెడ్యూలు మునిసిపల్ పరిధిలో ఉందని, అలాంటి షెడ్యూల్ ప్రాపర్టీని నారాయణపురం పంచాయతీలో ఉందని మార్చడానికి తహసీల్దార్ ఎవరని జడ్జి ప్రశ్నించినట్లు తెలిపారు. స్థానిక ముఖ్య ప్రజాప్రతినిధి రెవెన్యూ అధికారులతో కుట్ర చేసి కోర్టును తప్పుదోవపట్టించి 40 ఏళ్లుగా కాపురాలు ఉంటున్న ఇళ్లను కూల్చివేయడం అనేది ఘోర సంఘటన అన్నారు. అవినీతిపరులు ప్రజాప్రతినిధిగా ఉంటే ఎలాంటి నేరాలు, ఘోరాలు చేయొచ్చో ఈరోజు అందరూ గమనిస్తున్నారన్నారు.

పరిటాల రవీంద్ర హయాంలోనే...

పరిటాల రవీంద్ర హయాంలో 1995-96 ప్రాంతంలో నగరంలో మేదరవాండ్ల కొట్టాలును కూల్చి షాపింగ్ కాంప్లెక్స్ సముదాయాన్ని నిర్మించుకున్నారని ప్రకాష్ రెడ్డి ఆరోపించారు. ఆర్యవైశ్యులను బెదిరించి తక్కువ ధరకు భూమి కొని ఇల్లు కట్టుకున్నారన్నారు. శాంతి థియేటర్ పక్కన కృష్ణాభవన్ ఆస్తి అన్నదమ్ముల పంచాయితీలో ఉండగా, అందులో తలదూర్చి నామమాత్రపు ధరకి భూమి కొట్టేసి పెద్ద ఎత్తున కాంప్లెక్స్ కట్టుకున్నారన్నారు. అదే పరిటాల కుటుంబం ఈరోజు 68 సెంట్లు ఆక్రమించాలని చూస్తున్నారని ఆరోపించారు. శోత్రియందారులకు నామమాత్రపు ధర చెల్లించి పేదల ఇళ్లను కూల్చి వేయించాలని చూశారన్నారు. అక్కడ పెద్ద ఎత్తున షాపింగ్ కాంప్లెక్స్, ప్రైవేట్ నర్సింగ్‌హోం నిర్మించాలని చూస్తున్నారన్నారు. పరిటాల సునీత ఆక్రమణదారు, ఒక కబ్జాకోరు అని మండిపడ్డారు. ఆమె కన్ను ఈ ప్రాంతంపై పడింది కాబట్టే 180 ఎకరాల శోత్రియం భూములను బంధువులు, అనుచరులు జీపీఏ చేయించుకున్నారన్నారు. 450 మందికి నోటీసులు ఇప్పించారన్నారు. 2016-17 ప్రాంతంలోనూ విద్యారణ్యనగర్‌లో 400 ఇళ్లకు సంబంధించిన భూమి తాము కొనుగోలు చేశామంటూ దాదాపు రూ. 10 కోట్లు పేదల నుంచి వసూళ్లు చేశారన్నారు. ఇంత డబ్బు వసూలు చేసికూడా పరిటాల రవీంద్రనగర్ అని బోర్డు పెట్టించారని దుయ్యబట్టారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

అధికారులను దోషులుగా నిలబెడతాం

68 సెంట్ల స్థలాలపై తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనూ హైకోర్టు ఇదే తీర్పు ఇచ్చిందన్నారు. పేదలకు అండగా ఉంటానని ఇచ్చిన మాట ప్రకారం అప్పటి కలెక్టర్‌తో ప్రత్యేకంగా మాట్లాడి కౌంటర్ దాఖలు చేయగలిగామన్నారు. ఆధారాలతో కోర్టులో వాదనలు వినిపించేసరికి వారు పలాయన మంత్రం పఠించారన్నారు. పేదలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గతంలో అండగా నిలిచిందని, ఇప్పుడూ ఉంటుందని, భవిష్యత్తులోనూ నిలబడుతుందన్నారు. ఈ దుర్మార్గానికి కారకులైన అధికారులు తప్పనిసరిగా సమాధానం చెప్పాల్సిన రోజు వస్తుందన్నారు. న్యాయస్థానం ముందు దోషులుగా నిలబెడతామని ప్రకాష్‌రెడ్డి హెచ్చరించారు. సమావేశంలో రూరల్ ఎంపీపీ వరలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్, పార్టీ కన్వీనర్ పవన్, మాజీ కన్వీనర్ గోపాల్‌రెడ్డి, నాయకులు నీరుగంటి నారాయణరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు వెంకటేశ్వర్లు, సందీప్‌యాదవ్, పాపంపేట నాయకులు ఆకుల మునిశంకరయ్య, మాదన్న, కుమ్మెత గోపాల్‌రెడ్డి, గోపి, ఎర్రిస్వామి, అంజనరెడ్డి, రమేష్, రాజమ్మ, ప్రమీల పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేత ఇంటిపై రాళ్లదాడి

- గుత్తిలో పచ్చ మూక అరాచకం





కోనా ఇంటిపై రాళ్ల దాడి దృశ్యం, ధ్వంసమైన కారు

గుత్తి: టీడీపీ నాయకుల ఆగడాలు ఎక్కువ య్యాయి. సోమవారం రాత్రి గుత్తిలో మాజీ ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ నేత కోనా మురళీధర్ రెడ్డి ఇంటిపై రాళ్ల దాడి చేశారు. వ్యాపార లావాదేవీల విషయమై కోనా మురళీధర్‌రెడ్డి, టీడీపీ నాయకుడు ప్రతాప్ గుత్తి శివారులోని అమోఘ్ ధాబాలో తమ అనుచరులతో కలిసి చర్చిస్తున్న సమయంలో ఘర్షణ పడ్డారు. పోలీసులు చేరుకోవడంతో గొడవ సద్దుమణిగింది. సీఐ వెంకటేశ్వర్లు జోక్యం చేసుకుని కోనా మురళీధర్‌రెడ్డితో పాటు కుటుంబ సభ్యులను అనంతపురానికి పంపించారు. అప్పటికే కోనాపై దాడి చేయాలని నిర్ణయించుకున్న టీడీపీ మూకలు ద్విచక్ర వాహనాల్లో ఆయన ఇంటి వద్దకు చేరుకున్నారు. ఇంటిపై రాళ్ల వర్షం కురిపించారు. ఈ దాడిలో ఇంటి అద్దాలు ధ్వంసమయ్యాయి. ఇంటి ఆవరణలో పార్క్ చేసి ఉంచిన కారును కూడా ధ్వంసం చేశారు. ఈ విషయం తెలిసి పోలీసులు అక్కడికి చేరుకోవడంతో వారు పరుగులు తీశారు. ఈ సంఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

క్లుప్తంగా

నారాయణస్వామికి 'ఐసీఏఆర్' డాక్టరేట్



కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకుంటున్న నారాయణస్వామి

అనంతపురం అగ్రికల్చర్: వంకాయ పంటలో ఆశించే నులిపురుగులు (నెమటోడ్స్) మీద జన్యు, మాలుక్యూలర్ పరిశోధనలకు గానూ రాప్తాడు మండలం పెసరకుంట గ్రామానికి చెందిన రైతు శివయ్య కుమారుడు గుజ్జల నారాయణస్వామికి ప్రతిష్టాత్మక 'ఇండియన్ అగ్రికల్చర్ రిసెర్చ్ ఇన్స్‌స్టిట్యూట్ (ఐసీఏఆర్)' డాక్టరేట్ ప్రదానం చేసింది. సోమవారం ఢిల్లీలో జరిగిన ఐసీఏఆర్ 63వ స్నాతకోత్సవ కార్యక్రమంలో ఉద్యాన విభాగంలో కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్ చేతుల మీదుగా ఆయన డాక్టరేట్ అందుకున్నారు. డాక్టరేట్ అందుకున్న నారాయణస్వామిని గ్రామస్తులతో పాటు పలువురు అభినందించారు.

విద్యార్థిని అదృశ్యం

బత్తలపల్లి: సర్టిఫికెట్లు జిరాక్స్ చేయించుకుని వస్తానంటూ వెళ్లిన విద్యార్థిని కనిపించకుండా పోయింది. పోలీసులు తెలిపిన మేరకు.. బత్తలపల్లి మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి అనంతపురంలోని పీవీకేకేలో బీటెక్ ప్రథమ సంవత్సరం చదువుతోంది. కళాశాలకు సెలవుల నేపథ్యంలో గత వారం రోజులుగా ఇంటి పట్టునే ఉన్న ఆమె శనివారం తన ఆధార్ కార్డు అప్‌డేట్ చేయించుకుని, సర్టిఫికెట్లు జిరాక్స్ చేయించుకుని వస్తానంటూ కుటుంబసభ్యులకు తెలిపి వెళ్లింది. అప్పటి నుంచి ఆమె తిరిగి రాలేదు. బంధువులు, స్నేహితుల ఇళ్లలో గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. కళాశాలలో సైతం విచారించినా ఫలితం లేకపోయింది. దీంతో తన కుమార్తె కనిపించడం లేదంటూ బాధిత తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు బత్తలపల్లి పోలీసులు తెలిపారు.

ఇరువర్గాల ఘర్షణ - నలుగురికి తీవ్ర గాయాలు



గాయపడిన రాము

గుత్తి: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఆదివారం అర్ధరాత్రి ఇరువర్గాల మధ్య చోటు చేసుకున్న ఘర్షణలో నలుగురు యువకులు గాయపడ్డారు. వివరాలు.. గుత్తికి చెందిన రాము, యోగి మధ్య పాతకక్షలున్నాయి. ఈ నేపథ్యంలో ఆదివారం అర్ధరాత్రి తర్వాత ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుని కత్తులు, కట్టెలతో పరస్పర దాడులు చేసుకున్నారు. ఘటనలో రాము, ఆంజనేయులు అలియాస్ అదుర్స్, గణేష్ అలియాస్ ఘని, ఆంజనేయులు గాయపడ్డారు. క్షతగాత్రులకు స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉన్న రాము, ఆంజనేయులును అనంతపురానికి రెఫర్ చేశారు. ఘటనకు సంబంధించి ఇరువర్గాల ఫిర్యాదు మేరకు ఎనిమిది మందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

- ఏప్రిల్ 23 వరకూ ఒంటి పూట బడులు
- మధ్యాహ్నం 12:30 గంటలకే ఇంటికి చేరుతున్న విద్యార్థులు
- సరదాల మాటున పొంచి ఉన్న ప్రమాదాలు
- కనిపెట్టకపోతే భారీ మూల్యం చెల్లించక తప్పదు





ఒంటి పూట.. కనిపెట్టాలి ఓ కంట!

రాయదుర్గం: ఎండల తీవ్రత పెరిగిపోతుండడంతో విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా విద్యాశాఖ ఈ నెల 15 నుంచి ఒంటిపూట బడులు ప్రారంభించింది. ఏప్రిల్ 23 వరకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలన్నీ ఈ నిబంధన పాటించేలా మార్గదర్శకాలు జారీచేసింది. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు తరగతులు నిర్వహిస్తారు. త్వరగా నిద్ర లేచి ఉరుకులు పరుగులతో బడికి వెళ్లిన విద్యార్థులు మధ్యాహ్నం ఇళ్లకు చేరుకోగానే ఆటపాటలకు ప్రాధాన్యమివ్వడం సర్వసాధారణం. ఈ నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణ, నగర ప్రాంతాల్లోనూ వేసవి తాపాన్ని తీర్చుకునేందుకు ఈతకు ప్రాధాన్యతనిస్తున్నారు. ఆటలు, ఈత శారీరక వ్యాయామంగా మంచిదే అయినా... ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్న సరదా మాటున ప్రమాదాలు పొంచి ఉంటాయనే విషయాన్ని తల్లిదండ్రులు గుర్తించాలని నిపుణులు సూచిస్తున్నారు. ఉష్ణ తాపం ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని పిల్లలకు అవగాహన కల్పించాలని చెబుతున్నారు.

4 లక్షలకు పైగా విద్యార్థులు మండుటెండలోనే..

ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా 5,036 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 7,03,094 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇందులో పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు 54,402 మంది మినహా మిగిలిన వారంతా ఒంటిపూట బడులకు హాజరవుతున్నారు. అలాగే 4,72,860 మందికి పైగా విద్యార్థులు ఇతర గ్రామాలకు, పట్టణాల్లో ఉండే ప్రైవేటు పాఠశాలలకు వాహనాలు, కాలినడకన వెళ్లి వస్తుంటారు. వీరంతా మధ్యాహ్నం 12:30 గంటల తర్వాత పాఠశాల నుంచి మండుటెండలో ప్రయాణం చేయాల్సి ఉంటోంది. ఇలాంటి తరుణంలో పిల్లలు సరైన జాగ్రత్తలు తీసుకునేలా ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులూ చొరవ చూపాలి. ఎండలో బయటకు వెళ్లాల్సి వస్తే తప్పనిసరిగా టోపీ ధరించడం లేదా, తల.. ముఖ భాగం పూర్తిగా కప్పి ఉంచేలా వస్త్రం కట్టుకుంటే మరీ మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

తీవ్ర సూర్యరశ్మితో ప్రమాదం

ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సూర్యుడి కిరణాలు నిటారుగా భూమిపై పడుతుంటాయి. ఈ సమయంలో ఎక్కువగా బయట తిరిగితే అతినీలలోహిత కిరణాలు నేరుగా శరీరాన్ని తాకడం వల్ల చర్మ సంబంధిత వ్యాధుల బారిన పడే ప్రమాదముంది. మరోవైపు అంతర్గతంగా కూడా ఈ కిరణాల ప్రభావం ఉంటుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. బడి ముగించుకుని మధ్యాహ్నం ఇంటికి చేరుకున్న పిల్లలను తప్పనిసరి అయితే తప్పా బయటకు పంపకూడదని సూచిస్తున్నారు. ప్రయాణాల సమయంలో ద్విచక్ర వాహనంపై పిల్లలను ముందు భాగంలో కూర్చోబెట్టుకుంటే వడగాలుల తీవ్రతకు వడదెబ్బ సోకే ప్రమాదం ఉందంటున్నారు.

బోర్ అనిపించకుండా..

ఇంట్లో పిల్లలు ఖాళీగా ఉంటే చాలా బోర్‌గా ఫీలవుతారు. దీంతో సెల్‌ఫోన్లకు అలవాటు పడితే మరింత ప్రమాదం. పిల్లలు బోర్ ఫీల్ కాకుండా ఉండేందుకు నీడ పట్టున వారికి కొత్త ఆటలు గాని, విజ్ఞానాన్ని పంచే అంశాలపై ఆసక్తి పెంపొందించాలి. వీలైనంత మేర తల్లిదండ్రులు తమ పిల్లలతో ఎక్కువ సమయం గడిపేందుకు ప్రయత్నించాలి. పాఠశాలల్లో ఇచ్చిన హోమ్ వర్క్ మధ్యాహ్నం చేసుకునేలా ప్రోత్సహించాలి. తద్వారా సాయంత్రం ఎండ తగ్గిన తర్వాత ఆడుకునే వెసులుబాటు కలుగుతుంది. వేసవి తాపం కారణంగా పిల్లలు తొందరగా అలసిపోతారు కావున, మధ్యాహ్నం కొంత సమయం విశ్రాంతి తీసుకునేలా చూడాలి.

ఉదయం పరీక్ష రాసి...



విశ్వతేజ మృతదేహం

రాప్తాడురూరల్: స్నేహితులతో కలసి సరదాగా ఈతకు వెళ్లిన పదో తరగతి విద్యార్థి నీట మునిగి మృతి చెందాడు. ఈ విషాద ఘటన సోమవారం అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి శివారులోని చెక్‌డ్యాంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన మేరకు... కక్కలపల్లి కాలనీ పంచాయతీ పరిధిలోని మబ్బుకొట్టాలుకు చెందిన ఆర్టీసీ ఉద్యోగి ఎర్రిస్వామికి ఇద్దరు కుమారులు కాగా...చిన్నకుమారుడు విశ్వతేజ (16) నేతాజీ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్నాడు. సోమవారం ఉదయం గణితం పరీక్ష రాసి ఇంటికి చేరుకున్న విశ్వతేజ... మధ్యాహ్నం తన స్నేహితులు పిల్లిగుండ్లకాలనీకి చెందిన ఎన్.శశాంక్, టీవీ ప్రభాస్, అజయ్‌ఘోష్‌కాలనీకి చెందిన వీర శంకరాచారితో కలిసి రాచానపల్లి అక్కమ్మ ఆలయ సమీపంలోని చెక్‌డ్యాంలో ఈతకోసం వెళ్లారు. శశాంక్, వీరశంకరాచారి ఒడ్డున ఈత కొడుతుండగా కాస్త ఈత వచ్చిన ప్రభాస్, విశ్వతేజ చెక్‌డ్యాం మధ్యలోకి వెళ్లి పైనుంచి దూకారు. అనంతరం ఒడ్డుకు చేరుకునే ప్రయత్నంలో విశ్వతేజ నీట మునిగిపోవడంతో ఒడ్డున ఉన్న స్నేహితులు కేకలు వేశారు. దీంతో సమీపంలో ఉన్న కొందరు అక్కడకు చేరుకుని నీట మునిగిన విశ్వతేజను వెలికి తీసేలోపు ఊపిరి ఆడక మృతి చెందాడు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

తేలికపాటి ఆహారం మంచిది



వేసవిలో పిల్లలకు తేలిక పాటి ఆహారం చాలా మంచిది. త్వరగా జీర్ణ మయ్యే ఉప్మా, ఇడ్లీ వంటివి అల్పాహారంగా ఇవ్వాలి. పండ్ల రసాలు తాగించి బడికి పంపాలి. నీరు ఎక్కువగా తాగిస్తూ ఉండాలి. మరీ చల్లని పదార్థాలు ఇవ్వొద్దు. మధ్యాహ్నం ఇంటికి వచ్చిన తర్వాత తేలికగా ఉండే ఆహారం ఇవ్వాలి. వేపుళ్లు, మాంసాహారం వంటి వాటికి వేసవి పూర్తయ్యే వరకూ స్వస్తి చెప్పడం మేలు. రాత్రి పూట త్వరగా నిద్రించేలా అలవాటు చేయాలి. నిద్ర లేచిన తర్వాత కొంత సమయం చదువుకునేలా అలవాటు చేస్తే మేధాశక్తి పెరుగుతుంది.

– డాక్టర్ మెర్సీ జ్ఞానసుధ,
మెడికల్ సూపరింటెండెంట్,
ఏరియా ఆస్పత్రి, రాయదుర్గం

ఏప్రిల్ 6 నుంచి తాగునీటి పథకం కార్మికుల సమ్మె



జేసీ శివ్‌నారాయణ్ శర్మకు సమ్మె నోటీసు అందిస్తున్న శ్రీరామరెడ్డి నీటి సరఫరా కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు ఓబుళు

అనంతపురం అర్బన్: వేతన బకాయిలు చెల్లించాలనే డిమాండ్‌తో ఏప్రిల్ 6వ తేదీ అర్ధరాత్రి నుంచి శ్రీరామరెడ్డి నీటి సరఫరా పథకంలో పనిచేస్తున్న కార్మికులు నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు నీలకంఠాపురం శ్రీరామరెడ్డి నీటి సరఫరా స్కీమ్ కార్మిక సంఘం గౌరాధ్యక్షుడు ఓబుళు స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మను ఓబుళు, సంఘం నాయకులు కలసి సమ్మె నోటీసు అందజేశారు. కార్మికులకు ఆరునెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో కుటుంబపోషణ భారమై అప్పుల పాలవుతున్నారన్నారు. సకాలంలో కంతులు చెల్లించలేకపోవడంతో కొత్తగా అప్పులు కూడా పుట్టడం లేదన్నారు. దసరా, నూతన సంవత్సరం, సంక్రాంతి పండుగలకూ కార్మికులు పస్తులుండాల్సి వచ్చిందన్నారు. ఈ నెల 3వ తేదీలోపు వేతన బకాయిలు చెల్లిస్తామని ఫిబ్రవరి 2న సమ్మె నోటీసు ఇచ్చిన సందర్భంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు స్పష్టమైన హామీని ఇచ్చారన్నారు. అయినా నేటికీ బకాయిలు చెల్లించని కారణంగా సమ్మె బాట పట్టాల్సి వచ్చిందన్నారు. కార్మికులకు సంబంధించి ప్రధానమైన 12 డిమాండ్లను ఏప్రిల్ 6వ తేదీలోపు పరిష్కరించకుంటే అదే రోజు అర్ధరాత్రి నుంచి నిరవధిక సమ్మెలోకి వెళతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి నాగేంద్రకుమార్, సంఘం కార్యదర్శి రాము, కోశాధికారి వన్నూరుస్వామి, నాయుడు ఎర్రిస్వామి ఉన్నారు.

విద్యుత్ మీటర్ రీడర్ల నిరసన



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న దృశ్యం

అనంతపురం అర్బన్: డిమాండ్ల సాధనకు విద్యుత్ మీటర్ రీడర్లు ఆందోళన బాట పట్టారు. స్మార్ట్ మీటర్ల పేరుతో తమను రోడ్డున పడేయడం సరైంది కాదని, ప్రత్యామ్నాయ ఉపాధి చూపాలంటూ ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేష్‌గౌడ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ... విద్యుత్ శాఖను నమ్ముకుని మీటర్ రీడర్లు కొన్నేళ్లుగా పనిచేస్తున్నారన్నారు. స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయదలిస్తే మీటర్ రీడర్ల విద్యార్హతను బట్టి విద్యుత్‌శాఖలో ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి కృష్ణుడు, మీటర్ రీడర్ల సంఘం రాష్ట్ర కోశాధికారి రమేష్‌బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి రాంభీమప్ప, నాయకులు, సలీంబాషా, రామకృష్ణ, విజయ్, భరత్, మీటర్ రీడర్లు పాల్గొన్నారు.

పారా గేమ్స్‌లో ప్రతిభ



నీలం పల్లవి

అనంతపురం: న్యూఢిల్లీలో జరుగుతున్న ఖేలో ఇండియా పారా గేమ్స్‌లో జిల్లాకు చెందిన ఇద్దరు క్రీడాకారులు పతకాలు సాధించారు. షాట్‌పుట్ (ఎఫ్–56) విభాగంలో కందుకూరుకు చెందిన సాకే బాబు సిల్వర్ మెడల్ దక్కించుకోగా, పామిడి మండలం ఎద్దులపల్లికి చెందిన నీలం పల్లవి షాట్‌పుట్ (ఎఫ్–11) విభాగంలో కాంస్య పతకం కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా వారిని పారా అసోసియేషన్ అనంతపురం జిల్లా సెక్రెటరీ ఎన్.శ్రీనివాసులు అభినందించారు.

లారీల ఢీ - డ్రైవర్ దుర్మరణం

కనగానపల్లి: మండలంలోని పర్వతదేవరపల్లి సమీపంలో 44వ జాతీయ రహదారిపై రెండు లారీలు ఢీ కొన్నాయి. ఘటనలో నంద్యాల జిల్లా బనగానపల్లి మండలం పెదరాజుపల్లి గ్రామానికి చెందిన డ్రైవర్ ప్రసాద్ (45) దుర్మరణం పాలయ్యాడు. పోలీసుల వివరాల మేరకు... సోమవారం తెల్లవారుజామున అనంతపురం వైపు నుంచి బెంగుళూరు వైపు వెళుతున్న లారీ డ్రైవర్ పర్వతదేవరపల్లి వద్దకు చేరుకోగానే ఒక్కసారిగా వేగాన్ని తగ్గించాడు. దీంతో వెనుకనే వస్తున్న లారీ డ్రైవర్ గమనించి వేగాన్ని నియంత్రించుకునే సమయం కూడా లేకపోవడంతో నేరుగా వెళ్లి ముందున్న లారీని ఢీకొన్నాడు. ఘటనలో వెనుక ఉన్న లారీ క్యాబిన్ నుజ్జునుజ్జయింది. క్యాబిన్‌లోనే డ్రైవర్ ప్రసాద్ చిక్కుకున్నాడు. స్థానికులు గమనించి అతి కష్టంపై ఆయనను వెలికి తీశారు. అప్పటికే తీవ్ర రక్తస్రావంతో ఆయన మృతి చెందాడు. ఘటనపై కనగానపల్లి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

టీడీపీ నేత అత్యాశ

- ఈజీ మనీ కోసం మాయగాళ్ల ఉచ్చులో చిక్కుకున్న వైనం



కళ్యాణదుర్గం సమీపంలో టీడీపీ నేత ఇచ్చిన రూ.15లక్షల నగదును సర్దుకుంటున్న కర్ణాటకకు చెందిన వ్యక్తి (ఫైల్)

కళ్యాణదుర్గం: ఈజీ మనీ కోసం అత్యాశ పడిన ఓ టీడీపీ నేత పెద్ద మొత్తంలో నగదును మాయగాళ్ల చేతికిచ్చి మోసపోయాడు. ఇందుకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. వివరాలు... వ్యవసాయంతో జీవనం సాగిస్తున్న కళ్యాణదుర్గం మున్సిపాలిటీలో నివాసముంటున్న ఓ టీడీపీ నేత కొంత కాలంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం మొదలు పెట్టాడు. ఈ క్రమంలో పెట్టుబడులకు డబ్బు అవసరం కావడంతో ఈజీ మనీ కోసం ఆరా తీస్తూ వెళ్లాడు. విషయాన్ని గుర్తించిన కర్ణాటకకు చెందిన కొందరు వ్యక్తులు ఆయనను సంప్రదించారు. రూ.500 ఇస్తే రూ.వెయ్యి చెల్లిస్తామంటూ నమ్మబలికారు. వారి మాయలో చిక్కుకున్న సదరు టీడీపీ నేత తొలుత రూ.25వేలు ఇవ్వడంతో రూ.50 వేలు ఇచ్చారు. మరికొన్ని రోజులకు రూ.50వేలు ఇవ్వడంతో రూ.లక్షను వారు చెల్లించారు. ఇలా కొద్దికొద్దిగా ఇస్తే ఎప్పటికీ కష్టాలు తీరవని పెద్ద మొత్తంలో ఏమైనా ఇస్తే మంచి ఫలితం ఉంటుందని అవతలి వ్యక్తులు నమ్మబలకడంతో ఈసారి ఏకంగా సదరు టీడీపీ నేతకు రూ.15 లక్షలు సిద్ధం చేశాడు. కొన్ని రోజుల క్రితం కళ్యాణదుర్గానికి వచ్చిన కర్ణాటక వ్యక్తులు పట్టణ సమీపంలోని ఓ వ్యవసాయ పొలంలో టీడీపీ నేతతో సమావేశమయ్యారు. అనంతరం రూ.15 లక్షలు తీసుకుని రూ.30 లక్షలు ఉన్నాయంటూ ఓ పార్శిల్‌ను అప్పగించారు. ఇంటి కెళ్లి పార్శిల్ ఓపెన్ చేయగానే అందులో నోట్ల కట్టల పరిమాణంలోనే బ్లాక్ అండ్ వైట్ పేపర్లను చూసి టీడీపీ నేత కంగారు పడ్డాడు. ఇదేమిటని కర్ణాటక వ్యక్తులను ఫోన్లో ప్రశ్నిస్తే 'నీవు ఇచ్చినవన్నీ నకిలీ నోట్లు, నీ పై కర్ణాటకలో పోలీసు కేసు పెడతాం' అని బెదిరించినట్లు సమాచారం. దీంతో జరిగిన ఘటనను బయటకు చెప్పుకోలేక సదరు టీడీపీ నేత లోలోన మదన పడుతున్నట్లు తెలిసింది. ఇదే అంశంపై కళ్యాణదుర్గం సీఐ యువరాజు మాట్లాడుతూ.. నకిలీ నోట్ల మార్పిడి వ్యవహారం తన దృష్టికి రాలేదన్నారు. దీనిపై బాధితులతో విచారించినట్లుగా తెలిపారు. దీనిపై ఎలాంటి ఫిర్యాదూ అందలేదన్నారు. అయినా కర్ణాటక ప్రాంత వ్యక్తుల మోసంపై ఆరా తీస్తున్నట్లుగా పేర్కొన్నారు.

ముగిసిన మిల్లెట్ మేళా



మిల్లెట్‌మేళాలో మాట్లాడుతున్న విశ్రాంత వైస్ చాన్స్‌లర్ బండి వెంకటేశ్వర్లు

అనంతపురం అగ్రికల్చర్: 'మన వ్యవసాయం, పంటలు, వంటలు, ఆరోగ్యం' అనే ప్రధాన అంశంతో స్థానిక పోలీసు వెల్ఫేర్ కాంప్లెక్స్‌లో ప్రభుత్వ సంస్థలు, 18 ఎన్‌జీఓలు సంయుక్తంగా 'అనంత సుస్థిర వ్యవసాయ వేదిక' పేరుతో మూడు రోజుల పాటు ఏర్పాటు చేసిన 'మిల్లెట్‌మేళా' సోమవారం ముగిసింది. మూడవ రోజు సోమవారం ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ వైవీ మల్లారెడ్డితో పాటు విశ్రాంత వైస్ ఛాన్స్‌లర్ బండి వెంకటేశ్వర్లు, ప్రకృతి వనం ప్రతినిధి ప్రసాద్, జేడీఏ ఉమామహేశ్వరమ్మ, నాబార్డు డీడీఎం అనురాధ, జెడ్‌బీఎన్‌ఎఫ్ డీపీఎం లక్ష్మానాయక్ తదితరులు హాజరై వివిధ అంశాలపై రైతులు, ఎన్‌జీఓ సభ్యులకు అవగాహన కల్పించారు. ప్రధానంగా వ్యవసాయం, పంటలు, వంటలు, ఆరోగ్యం అనేవి ఒకదానితో ఒకటి ముడిపడివున్నా... ఇటీవల కాలంలో వాటిని వేర్వేరుగా చూడటంతో అటు రైతులు ఇటు ప్రజలు ఇబ్బంది పడాల్సి వస్తోందన్నారు. దీని వల్ల మార్కెటింగ్, గిట్టుబాటు ధరల్లేక రైతులు నష్టపోతుండగా, రకరకాల అనారోగ్య సమస్యలతో సంపాదన మొత్తం వైద్య ఖర్చులకే వెచ్చించాల్సి వస్తోందన్నారు. చిరుధాన్యపు పంటలను ప్రోత్సహించడంతో పాటు వాటితో తయారు చేసే ఆహారోత్పత్తుల వాడకం పెరిగితే పర్యావరణ పరిరక్షణ, ప్రజారోగ్యం మెరుగుపడటమే కాకుండా రైతులకు వ్యవసాయం లాభసాటిగా మారుతుందన్నారు. ప్రధానంగా రాగులు, కొర్రలు, సజ్జలు, జొన్నలు, ఆరికలు, ఊదర్లు, అండుకొర్రలు లాంటి సంప్రదాయ, పాతతరం చిరుధాన్యపు ఉత్పత్తులు తినడంపై ప్రజలు దృష్టి సారించాలని సూచించారు. ఏఎఫ్ ఎకాలజీ, ఆర్డీటీ, వాసన్, ఏపీ మాస్, కార్డు, సీఏస్ఏ, రెడ్స్, టింబక్టు, రిడ్స్, స్వచ్ఛ కాడ్యమ్, ఎంపవరింగ్ భారత్, అనంత నాచురల్స్, మిల్లెట్ మ్యాజిక్, పాస్, జన జాగృతి, ఐఐఎంఆర్ తదితర ఎన్‌జీఓ ప్రతినిదులతో పాటు ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, నాబార్డు, ఉద్యానశాఖ అధికారులు, పెద్ద సంఖ్యలో రైతులు హాజరయ్యారు.

పిచ్చికుక్క దాడిలో నలుగురికి గాయాలు

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని మల్లిపల్లి గ్రామంలో సోమవారం పిచ్చికుక్క స్వైరవిహారం చేసింది. గ్రామానికి చెందిన గిరిస్వామి, బొజ్జప్ప, శీనప్ప, కృష్ణమూర్తిపై వరుసగా దాడి చేసి గాయపరిచింది. క్షతగాత్రులు స్థానిక సీహెచ్‌సీలో చికిత్స పొందారు.

టెండర్ల వాయిదాతో ఉద్రిక్తత



అధికారులతో వాగ్వాదం చేస్తున్న టెండరుదారులు

ఉరవకొండ: స్థానిక మేజర్ పంచాయతీ ఆదాయ వనరులపై సుంకం వసూలు చేసేందుకు నిర్వహించిన టెండర్ల పరిశీలన ప్రక్రియను అధికారులు వాయిదా వేశారు. దీంతో ఉద్రిక్తత నెలకొంది. వివరాలు... ఉరవకొండ బస్టాండ్, దినసరి మార్కెట్, కబేళా, మటన్ మార్కెట్, జీవాల సంత, పాయిఖానా తదితరాలపై సుంకం వసూలు చేసే హక్కుకు సోమవారం సీల్డ్ టెండర్లను అధికారులు ఆహ్వానించారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈఓఆర్‌డీ సతీష్ సమక్షంలో సీల్డ్ కవర్లను పంచాయతీ కార్యదర్శి గౌస్‌సాహెబ్ స్వీకరించారు. మధ్యాహ్నం 3 గంటల తర్వాత టెండర్లను తెరిచి ఎక్కువ కోట్ చేసిన వారికి హక్కులు కేటాయించాల్సి ఉంది. అయితే 3 గంటల తర్వాత చాలా మంది డిపాజిట్ చెల్లించి రశీదులు తీసుకోని సీల్డ్ టెండర్లు దాఖలు చేసేందుకు వచ్చారు. దీంతో అధికారులు టెండర్ల పరిశీలనను ఈ నెల 26వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించడంతో ఒక్కసారిగా ఉద్రిక్తత చోటు చేసుకుంది. నిబంధనల మేరకు మధ్యాహ్నం 2 గంటల వరకు వేసిన టెండర్లను కాదని 3 గంటల తర్వాత టెండర్లను ఎలా స్వీకరిస్తారంటూ అధికారులను ప్రశ్నించారు. నిర్దేశించిన సమయంలో లోపు ఎన్ని టెండర్లు పడ్డాయో వాటిని మాత్రమే పరిగణనలోకి తీసుకుని పరిశీలించి, హక్కులు కేటాయించాలని డిమాండ్ చేశారు. పరిస్థితి చెయ్యి దాటిపోతుండడంతో సీఐ మహానంది, ఎస్ఐ జనార్ధన్‌నాయుడు, సిబ్బంది అక్కడకు చేరుకుని టెండరుదారులను సముదాయించి ఈ నెల 26న తిరిగి టెండర్లలో పాల్గొనాలని సూచించారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



సుంకన్న (ఫైల్)

విడపనకల్లు: విద్యుత్ షాక్‌కు గురై ఓ యువకుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... విడపనకల్లు మండలం పాల్తూరు గ్రామ ఎస్సీ కాలనీకి చెందిన హరిజన సుంకన్న (22) సోమవారం ఉదయం తాగునీటి కుళాయికి విద్యుత్ మోటార్‌ను అమర్చుతుండగా విద్యుత్ ప్రసారం జరిగి షాక్‌కు గురై కుప్పకూలాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే స్థానిక పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం ఉరవకొండలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే సుంకన్న మృతి చెందినట్లు నిర్ధారించారు. కాగా, ఆయనకు ఏడాది క్రితమే వివాహమైంది. కవల పిల్లలు (మగ) ఉన్నారు. ఘటనపై పాల్తూరు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వినతులను సకాలంలో పరిష్కరించాలి : ఎస్పీ



వినతులు స్వీకరిస్తున్న ఎస్పీ జగదీష్

అనంతపురం: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వివిధ సమస్యలపై 63 వినతులు అందాయి. ఎస్పీ పి.జగదీష్ స్వయంగా వినతులు స్వీకరించి, బాధితులతో మాట్లాడారు. సమస్య తీవ్రత తెలుసుకుని చట్టపరిధిలోని అంశాలకు సకాలంలో పరిష్కారం చూపాలని సంబంధిత ఎస్‌హెచ్‌ఓలను ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ డీవీ రమణమూర్తి, మహిళా విభాగం డీఎస్పీ ఎస్.మహబూబ్ బాషా పాల్గొన్నారు.

తాడిపత్రిలో మారణాయుధాలతో దాడులు

తాడిపత్రిటౌన్: స్థానిక చేపల మార్కెట్ సమీపంలో నివాసం ఉంటున్న చంద్ర, కన్నా వర్గీయులు సోమవారం మారణాయుధాలతో పరస్పర దాడులకు తెగబడ్డారు. కొంత కాలంగా చంద్ర, కన్నా మధ్య ఆస్తి వివాదం నెలకొంది. దీంతో రెండు గ్రూపులుగా విడిపోయి కొంత కాలంగా తరచూ గొడవలు పడుతున్నారు. ఈ క్రమంలో సోమవారం వేటకొడవళ్లు, కత్తులు, రాళ్లతో పరస్పర దాడులు చేసుకోవడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుంటుండగా గొడవ పడుతున్న వారు అక్కడి నుంచి పారిపోయారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు.

అడ్డగోలుగా సీ బిల్లులు

- నగరపాలకలో గుట్టుచప్పుడు కాకుండా సీ బిల్లులు
- టెండర్ లేకుండా రూ.20 లక్షల వరకూ చేస్తున్న వైనం
- అధికారుల కనుసన్నల్లో తెలుగు తమ్ముళ్ల స్వాహా పర్వం
- రూ.లక్షల ప్రజాధనం వృథా
- కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు



సీ బిల్లులపై విచారణ చేపట్టాలని కమిషనర్ బాలస్వామికి ఫిర్యాదు చేస్తున్న కార్పొరేటర్లు కమల్‌భూషణ్, నరసింహులు

అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వంలో నగరపాలక సంస్థలో అడ్డగోలు బాగోతాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. తెలుగు తమ్ముళ్లతో పలువురు అధికారులు కుమ్మక్కై నిబంధనలకు తిలోదకాలు ఇచ్చేస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నగరపాలక సంస్థ ప్రజాధనానికి గండి కొడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కార్మికులకు అందించే పనిముట్ల పేరుతో ఇప్పటికే రూ.10 లక్షలకు పైగా గుట్టుచప్పుడు కాకుండా బిల్లులు చేసేయడం పెద్ద దుమారం రేపుతోంది. ఇదే విషయమై వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు సోమవారం నగరపాలక సంస్థలో కమిషనర్ బాలస్వామికి ఫిర్యాదు చేశారు.

టెండర్లకు మంగళం..


వాస్తవంగా రూ.లక్ష దాటితే తప్పనిసరిగా టెండర్‌కు వెళ్లాలి. దీంతో పాటుగా రూ.లక్ష వరకూ నామినేషన్ వెళ్లవచ్చు. కానీ కూటమి ప్రభుత్వంలో తెలుగు త మ్ముళ్లు కొత్త ఎత్తుగడ వేశారు. రూ.10,000 నుంచి 20,000 వరకూ ఉండే సీ బిల్లును రూ.లక్ష వరకూ పెంచేశారు. ఇది నిబంధనలకు విరుద్ధం. నగరపాలక సంస్థలోని 50 డివిజన్ల పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న 609 మంది పారిశుధ్య కార్మికులకు పరకలు, గంపలు, ఆప్రాన్స్, తదితర పనిముట్ల కోసం ఏకంగా 15 సీ బిల్లులు పెట్టారు. ఒక్కో సీ బిల్లు రూ.90,000 నుంచి రూ.95,000 వరకూ నమోదు చేశారు. వాస్తవంగా ఇంత పెద్ద మొత్తంలో బిల్లు చేయాలంటే కచ్చితంగా టెండర్ ప్రాతిపదికన వెళ్లాలి. టెండర్ల ప్రకారం వెళ్తే నగర పాలక సంస్థకు కొంతైనా ఆదాయం సమకూరుతుంది.

చర్యలు తీసుకోవాలి

నగరపాలక సంస్థలో అవినీతి జరిగిదంటూ ఆరోపణలు చేస్తున్నారు. సీ బిల్లుల పేరిట రూ.లక్షల్లో బిల్లులు ఏవిధంగా చేస్తున్నారు. కార్మికుల పనిముట్లకు సంబంధించి రూ.లక్షల్లో బిల్లులు చేస్తున్న ఓ ప్రజారోగ్యాధికారి, ఓ అకౌంటెంట్‌పై చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్లు కమల్‌భూషణ్, మల్లెమీద నరసింహులు, శ్రీనివాసులు కోరారు. సోమవారం కమిషనర్ బాలస్వామికి స్పందనలో ఫిర్యాదు చేశారు. అదేవిధంగా కార్పొరేటర్ల పేరు చెప్పి టౌన్ ప్లానింగ్ అధికారులు వసూళ్లకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

హద్దుమీరుతున్న అధికారులు

వాస్తవంగా నగరపాలక సంస్థ పరిధిలో ఏ పనులు చేపట్టాలన్నా.. నిబంధనల ప్రకారం సంబంధిత సెక్షన్స్ హెడ్స్ వెళ్లాల్సి ఉంటుంది. కానీ ప్రజారోగ్య విభాగంలోని ఓ కీలక అధికారి ఏకపక్షంగా ఫైల్‌ను సిద్ధం చేసి, సదరు తెలుగు తమ్ముళ్లకు పరోక్షంగా సహకరించారన్న వార్తలు వినిపిస్తున్నాయి. ప్రజారోగ్యాధికారి మద్దతుగా ఓ అకౌంటెంట్ కూడా సహకహరించారని సమాచారం. దీంతో 13 సీ బిల్లులకు సంబంధించి రూ.13 లక్షలకు గానూ రూ.10,50,000 (రూ.10.5 లక్షలు) ఫైల్‌ను సిద్ధం చేసి కమిషనర్‌కు పంపారు. కాగా కమిషనర్ రూ.10.05 లక్షలు మంజూరు చేశారు. ఓ అకౌంటెంట్ ఇవే కాకుండా నగరపాలక సంస్థలో వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి రూ.లక్షల్లో బిల్లులకు పరోక్షంగా తెలుగు తమ్ముళ్లకు సహకరిస్తున్నట్లు తెలిసింది.



పారిశుధ్య కార్మికుల పనిముట్ల కోసం చేసిన రూ.92,500 సీ బిల్లు

విచారణకు ఆదేశిస్తాం

నగరపాలక సంస్థలో సీ బిల్లుల వ్యవహారంపై వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై విచారణకు ఆదేశిస్తాం. బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

– బాలస్వామి, కమిషనర్

విమానాశ్రయానికి భూములు ఇవ్వం

- బలవంతంగా తీసుకుంటే ఆత్మహత్య చేసుకుంటాం
- తెగేసి చెప్పిన తలుపూరు రైతులు



సమస్యను చెప్పుకునేందుకు కలెక్టరేట్‌కు వచ్చిన రైతులు

అనంతపురం అర్బన్: 'మా ప్రాంత పరిసరాల్లో విమానాశ్రయం ఏర్పాటు చేస్తారని.. ఇందుకోసం వ్యవసాయ భూములు తీసుకుంటారని జరుగుతున్న ప్రచారం మమ్మల్ని ఆందోళనకు గురి చేసింది. మేము వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. విమానాశ్రయానికి ఎట్టిపరిస్థితుల్లోనూ మా భూములు ఇవ్వబోం. బలవంతంగా తీసుకోవాలని ప్రయత్నిస్తే ఆత్మహత్యలు చూస్తారు.' అంటూ ఆత్మకూరు మండలం తలుపూరుకు చెందిన రైతులు తేగేసి చెప్పారు. తమ సమస్యను చెప్పుకునేందుకు సోమవారం కలెక్టరేట్‌కు వచ్చారు. రైతులు శివారెడ్డి, భాస్కర్‌రెడ్డి, చాకలి లక్ష్మన్న, వరలక్ష్మి, తదితరుల విలేకరులతో మాట్లాడారు. కూడేరు మండలం తలుపూరులో 1,100 ఎకరాలు, అనంతపురం రూరల్ మండలం సజ్జలకాలువలో 102 ఎకరాలు, బాపనపల్లిలో 378 ఎకరాలు వ్యవసాయ భూములను విమానాశ్రయానికి తీసుకుంటున్నట్లు, అధికారులూ సర్వే చేసినట్లు ప్రచారం జరుగుతోందన్నారు. ఈ భూములు కోల్పోతే తమకు ఇక బతుకులు లేవన్నారు. తామంతా వ్యవసాయం చేసుకుని జీవిస్తున్నామన్నారు. తలుపూరులో దాదాపు 400 ఎకరాలకు పైగా ఉద్యాన పంటలు పండిస్తున్నట్లు తెలిపారు. విమానాశ్రయం ఏర్పాటు చేయాలనుకుంటే వేరే ఎక్కడైనా ప్రభుత్వ భూమి తీసుకోవాలని సూచించారు. అంతే తప్ప రైతుల భూములను తీసుకోవాలని చూస్తే ఊరుకోబోమన్నారు. అలా కాకుండా ప్రభుత్వం, అధికారులు బలవంతంగా తీసుకునే ప్రయత్నం చేస్తే తమకు ఆత్మహత్య తప్ప మరోమార్గం లేదన్నారు. అనంతరం జేసీ శివ్ నారాయణ శర్మకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతులు సదాశివరెడ్డి, రమేష్‌రెడ్డి, మహిళ రైతులు సునీత, లలిత, మంజుల, తదితరులు పాల్గొన్నారు.

అనంత బ్రాహ్మణులకు రాష్ట్ర కార్యవర్గంలో చోటు



సమావేశంలో మాట్లాడుతున్న బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు

అనంతపురం కల్చరల్: ఏపీ బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య రాష్ట్రస్థాయి కార్యవర్గంలో పలువురు అనంత వాసులకు చోటు కల్పించారు. ఈ నేపథ్యంలో సోమవారం సాయంత్రం స్థానిక మొదటి రోడ్డు శివాలయంలో నూతనంగా ఎంపికైన కార్యవర్గ సభ్యులకు అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులైన సీవీ మురళీధర్, కరణం రామసుబ్బారావు ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన వారి వివరాలను వెల్లడించారు. క్రమశిక్షణ సంఘం రాష్ట్ర సలహాదారుడిగా అనంతకు చెందిన ఏఎల్ఎన్ శాస్త్రి, లీగల్ అడ్వైజర్‌గా హోసూరు రామసుబ్రమణ్యం, ఉపాధ్యక్షులుగా దాక్షాయిని, లోకనాథస్వామి, కార్యదర్శిగా సత్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా మారుతి అలాగే ఈసీ మెంబర్లుగా కొనకంచి మారుతి, చంద్రకాంత్‌కు రాష్ట్రస్థాయి కార్యవర్గంలో కీలక బాధ్యతలు అప్పగించారని వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా బ్రాహ్మణుల అభ్యున్నతే లక్ష్యంగా కొత్త కార్యవర్గం పని చేస్తుందని తెలిపారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను ఘనంగా సత్కరించారు. అంతకు ముందు సాగిన వేదపఠనం, ప్రత్యేక పూజలు భక్తిభావాన్ని పెంచాయి. కార్యక్రమంలో జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

క్షయను తరిమికొడదాం



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబ దేవి



టీబీపై అవగాహన కల్పిస్తున్న బోధనాస్పత్రి వైద్యులు

అనంతపురం మెడికల్: క్షయ వ్యాధిని తరిమికొడదామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబ దేవి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు పిలుపునిచ్చారు. ప్రపంచ క్షయ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం డీఎంహెచ్‌ఓ, బోధనాస్పత్రి ఆధ్వర్యంలో వేర్వేరుగా ర్యాలీలు చేపట్టి ప్రజలకు అవగాహన కల్పించారు. డీఎంహెచ్‌ఓ ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీని డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబ దేవి జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ డీఎంహెచ్‌ఓ కార్యాలయం నుంచి సప్తగిరి సర్కిల్ వరకు జరిగింది. అక్కడ మానవహారంగా ఏర్పడి అవును టీబీను అంతం చేయగలం. అంకితం, పెట్టుబడి అందించు సేవల నినాదంతో ర్యాలీ నిర్వహించారు. టీబీని అరికట్టడానికి కృషి చేస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ తెలిపారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అనుపమ జేమ్స్, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ మురళీకృష్ణ, సభ్యులు డాక్టర్ శ్రీనాథ్, డాక్టర్ అభిషేక్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బోధనాస్పత్రి ఆధ్వర్యంలో..

సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు ఆధ్వర్యంలో వైద్య కళాశాల నుంచి డీఎంహెచ్‌ఓ కార్యాలయం వరకూ సాగింది. డీఎంహెచ్‌ఓ కార్యాలయం ముందు మానవహారంగా ఏర్పడి టీబీని పారద్రోలుదాం అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్లు డాక్టర్ షంషాద్‌బేగం, డాక్టర్ షారోన్ సోనియా, డాక్టర్ శారద, పల్మనాలజీ హెచ్‌ఓడీ డాక్టర్ రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఆత్మకూరు: క్షయ నిర్మూలనకు ప్రతి ఒక్కరం పాటుపడుదామని మండల వైద్యాధికారి సబిహా సుల్తానా తెలిపారు. సోమవారం ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ.. క్షయ నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. టీబీ ఓడిపోతుంది.. దేశం గెలుస్తుంది అంటూ నినాదాలు చేశారు. వేసవిలో వడదెబ్బ తగలకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

'తుప్పు' వదిలిస్తారు..

- ఆర్టీఏలో సీజ్ వాహనాలకు మోక్షం
- నేడు అనంతపురం ఆర్టీఏ కార్యాలయంలో 76 వాహనాలకు వేలం



ఆర్టీఏ కార్యాలయంలో ఉన్న వాహనాలు

అనంతపురం సెంట్రల్: నేరాలు, ఇతర కేసుల్లో పట్టుబడి సీజ్ చేసిన వాహనాలకు ఎట్టకేలకు మోక్షం లభిస్తోంది. సంవత్సరాలుగా ఆర్టీఏ కార్యాలయంలో వదిలేయడంతో చాలా వాహనాలు తుప్పు పడుతున్నాయి. కొన్ని వాహనాలకు విలువైన పరికరాలు మాయం అవుతున్నాయి. ఓ వైపు యజమానులు తీసుకెళ్లక పోవడంతో పనికి రాకుండా పోతున్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ నిబంధనల ప్రకారం వేలం వేయాలని రవాణాశాఖ అధికారులు నిర్ణయించారు. ఉప రవాణా కమిషనర్ వీర్రాజు ప్రత్యేక చొరవ తీసుకుని వాహనాల వేలానికి శ్రీకారం చుట్టారు. గత ఫిబ్రవరి 12వ తేదీన 67 వాహనాలను తుక్కు కింద వేలంలో విక్రయించారు. రూ.4.34 లక్షల ఆదాయం సమకూరింది. ఈనెల 25న (మంగళవారం) అనంతపురం రవాణా కార్యాలయం, గుత్తి, కళ్యాణదుర్గం, రాయదుర్గం ఆర్టీసీ డిపోల్లో సీజ్ చేసి ఉంచిన మొత్తం 76 వాహనాలకు వేలం వేస్తున్నారు. ఇందులో చాలా వాహనాలు రోడ్డుపై తిరిగేందుకు అనువుగా ఉండటంతో మరింత ఎక్కువ ఆదాయం వస్తుందని అధికారులు భావిస్తున్నారు.

కాలిపోయిన లారీల పరిశీలన



తిమ్మంపేట సమీపంలో కాలిపోయిన లారీని పరిశీలిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

గార్లదిన్నె: కల్లూరు, తిమ్మంపేట గ్రామాల సమీపంలో అగ్ని ప్రమాదంలో కాలిపోయిన లారీలను సోమవారం అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వరుసగా రెండు రోజులు 44వ జాతీయ రహదారిపై రెండు లారీల్లో మంటలు వ్యాపించి వాహనంతో పాటు అందులో ఉన్న సరుకు కాలిపోవడంతో.. ప్రమాదంపై ఆరా తీశామన్నారు. దూర ప్రయాణం వెళ్లే వాహనదారులు మధ్యలో ఆగి వాహనం ఇంజన్ వేడి తగ్గించుకొని వెళ్లాలని డ్రైవర్లకు సూచించారు. ఎస్ఐ గౌస్‌మహమ్మద్ బాషా పాల్గొన్నారు.

వాహనం బోల్తా.. ముగ్గురికి గాయాలు

గార్లదిన్నె: మండలంలోని రామ్‌దాస్ పేట సమీపంలో 44వ జాతీయ రహదారిపై సోమ వా రం జరిగిన ప్రమాదంలో ముగ్గురికి గాయాలవడంతోపాటు రెండు గొర్రెలు మృతి చెందాయి.ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా మాట్లాడుతూ తమిళనాడు రాష్ట్రం వేలూరుకు చెందిన ఆరుగురు కర్నూలు జిల్లా పత్తికొండలో సంతకు వెళ్లి 50 గొర్రెలు కొనుగోలు చేశారు. వాటిని బొలెరో వాహనంలో వేలూరుకు తీసుకెళ్తుండగా.. రామ్‌దాస్‌పేట సమీపంలో వెనుక టైరు పంచర్ కావడంతో వాహనం అదుపు తప్పి డివైడర్ ఎక్కి రోడ్డుపై బోల్తా పడింది. ఘటనలో రెండు గొర్రెలు మృతి చెందగా శ్రీనివాసులు, వినోద్‌కుమార్, మునిరత్నంకు గాయాలయ్యాయి. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి క్షతగాత్రులను అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

శ్రీనివాస రెడ్డికి డాక్టరేట్



శ్రీనివాస రెడ్డిని అభినందిస్తున్న రీసెర్చ్ గైడ్ ప్రొఫెసర్ డి.అంజనేయులు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని కామర్స్ విభాగంలో పరిశోధన చేసిన దుబ్బా శ్రీనివాస రెడ్డికి డాక్టరేట్ ప్రదానం చేశారు. ప్రొఫెసర్ డి.అంజనేయులు పర్యవేక్షణలో (స్వయం సహాయక బృందాల పనితీరు వాటిపై విశ్లేషణాత్మక అధ్యయనం) 'పర్‌ఫార్మెన్స్ ఆఫ్ సెల్ఫ్-హెల్ప్ గ్రూప్స్: యాన్ అనలిటికల్ స్టడీ' అనే అంశంపై పరిశోధన చేశారు. ఈ అంశంపై పలు జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్ ప్రచురించారు. శ్రీ సత్యసాయి జిల్లా రామగిరి మండలం పోలేపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాస్ రెడ్డి ఎస్కేయూలో విద్యార్థి నాయకుడిగా, పలు విద్యార్థి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. ఈ నేపథ్యంలో అప్పటి వర్సిటీ వీసీ పలు ఇబ్బందులకు గురిచేసినా, వాటిని అధిగమించి డాక్టరేట్ పూర్తి చేశారు. ఈ సందర్భంగా బోధన, బోధనేతర ఉద్యోగులు, మిత్రులు అభినందించారు.

అనంత విద్యార్థినికి ఓక్లహోమా యూనివర్సిటీలో సీటు



లోహితాస్య

అనంతపురం: నగరానికి చెందిన చుండూరు లోహితాస్య ప్రతిష్టాత్మక ఓక్లహోమా విశ్వవిద్యాలయంలో ఇంటర్నల్ మెడిసిన్ విభాగంలో ఎండీ సీటు సాధించారు. వివిధ దశల్లో మెడికల్ లైసెన్సింగ్ ప్రవేశ పరీక్షలు, ఇంటర్వ్యూల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మొదటి ప్రయత్నంలో సీటు సాధించారు. నెలకు రూ.7 వేల డాలర్స్ పారితోషికం అందుకోనున్నారు. లోహితాస్య తల్లిదండ్రులు డాక్టర్ సుబ్రమణ్యం పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా, తల్లి సి.వెంకట నారాయణమ్మ కర్నూలు జిల్లాలో రెవెన్యూ అధికారిగా పనిచేస్తున్నారు.

ఘర్షణలో దంపతులకు గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని జక్కలచెరువు ఆర్ఎస్ గ్రామంలో పొలానికి వెళ్లే రస్తా విషయంలో సోమవారం ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన రామకృష్ణకు పక్క పొలం రైతు ప్రసాద్‌తో కొన్ని నెలలుగా రస్తా విషయంలో గొడవలున్నాయి. ఈ క్రమంలో గ్రామ శివారులో ఉన్న పొలం వద్ద ఘర్షణ జరిగి తీవ్ర స్థాయిలో వాగ్వాదం చేసుకున్నారు. ఈ క్రమంలో మాటామాటా పెరిగి ఇరువర్గాల వారు పరస్పరం దాడులు చేసుకున్నారు. దాడిలో రామకృష్ణ, లక్ష్మీదేవి దంపతుల తలకు బలమైన గాయాలవడంతో బంధువులు గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సుమారు పది మంది తమపై దాడి చేసి గాయపరిచారని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

ఎస్‌వీఐటీలో పోస్టర్ ప్రెజెంటేషన్



ప్రెజెంటేషన్ ఇస్తున్న విద్యార్థులు

రాప్తాడు: హంపాపురం సమీపంలోని శ్రీవెంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎస్‌వీఐటీ) ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం మొదటి సంవత్సరం విద్యార్థులు ఫిజిక్స్–క్రియేటివ్ లెర్నింగ్‌పై పోస్టర్ ప్రజెంటేషన్ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ వీ.బీ.ఆర్.శర్మ, చైర్మన్ కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ వెన్నపూస రవీంద్రా రెడ్డి, కళాశాల ఎండీ వెన్నపూస రమాకాంత్ రెడ్డి, ప్రిన్సిపాల్ విష్ణువర్దన్, ఏఓ వెంకట శివా రెడ్డి, హెచ్ అండ్ ఎస్ విభాగపతి మధుసూదన్ రెడ్డి, ఎస్.ఫర్వీన్ పాల్గొన్నారు.

ముస్లింలకు న్యాయం చేయాలి

అనంతపురం కల్చరల్: కర్ణాటక ప్రభుత్వం ముస్లిం కాంట్రాక్టర్లకు ఎస్సీ, ఎస్టీలతో పాటూ 4 శాతం రిజర్వేషన్ కల్పించడానికి కృషి చేస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో కూడా ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించాలని పలువురు ముస్లిం నాయకులు కోరారు. సోమవారం ప్రజాబలం కార్యాలయంలో జరిగిన సమావేశంలో విలేకరులతో మాట్లాడారు. ఏపీలో ముస్లింల అభివృద్ధికి రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య చట్టాల్లో సవరణలు తీసుకువచ్చి ముస్లింలకు తగిన న్యాయం చేశారని గుర్తు చేశారు. ఇక్కడ కూడా అదే విధానాన్ని పాటిస్తే సుమారు రెండు కోట్ల మేరకు విలువ కలిగిన ప్రభుత్వ పనులు చేసేందుకు అర్హులవుతారన్నారు. కార్యక్రమంలో మహబూబ్ బాషా, జాకీర్ హుస్సేన్, ముక్తియార్, నజీర్,గౌస్ తదితరులు పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణానికి గోటి తలంబ్రాలు



వడ్లను ఒలుస్తున్న భక్తులు

అనంతపురం కల్చరల్: భద్రాచలం తరహాలో అనంతలోని కోదండ రాముని కల్యాణానికి గోటితో ఒలిచిన తలంబ్రాలను వినియోగిస్తున్నట్లు భక్తమండలి ప్రతినిధి నరేంద్ర చౌదరి తెలిపారు. శ్రీరామనవమి సందర్భంగా సాగే సీతారాముల కల్యాణ మహోత్సవానికి వరిమళ్ల నుంచి వడ్లను సేకరించి వాటిని గోటితో ఒలిచిన బియ్యాన్ని సేకరించే ప్రక్రియ సోమవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తొలిసారి సత్సంప్రదాయానికి శ్రీకారం చుడుతున్నామని తెలిపారు. తాము ఒలిచిన వాటినే తలంబ్రాలుగా మార్చుకునే అవకాశాన్ని భక్తులకు కల్పిస్తున్నామని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పండుగ వచ్చే వరకు ఉదయం, సాయంత్రం ప్రక్రియ కొనసాగుతూ ఉంటుందన్నారు.

ఆకట్టుకుంటున్న చేనేత ప్రదర్శన



దుస్తులను పరిశీలిస్తున్న మహిళలు

అనంతపురం కల్చరల్: నగరంలోని అంబేడ్కర్ భవన్ వేదికగా గత మూడు రోజులుగా సాగుతున్న చేనేత హస్తకళా ప్రదర్శన ఆకట్టుకుంటోంది. ధర్మవరం, మంగళగిరి, కళంకారి, ఉప్పాడతో పాటూ అస్సాం, బీహార్, ఛత్తీస్‌ఘడ్ ట్రిబిల్ వర్క్, జమ్ముకశ్మీర్ ఎంబ్రాయిడరీ చీరలు, కర్ణాటకలోని క్రేప్ ప్రింటెడ్ శారీస్, మధ్యప్రదేశ్‌లోని చందేరి, రాజస్థాన్‌లోని కోటా, బందాని, బ్లాక్ ప్రింట్, ఉత్తరప్రదేశ్‌లోని జమ్దాని, బనారస్, లక్నో డిజైనర్ కుర్తీస్, డ్రెస్ మెటీరియల్స్, హర్యానా బెడ్‌షీట్స్, కుషన్ కవర్స్, డోర్ కర్టన్లను ప్రదర్శనలో ఉంచారు. వచ్చేనెల 2 వరకు సాగే చేనేత హస్తకళా ప్రదర్శనను సద్వినియోగం చేసుకోవాలని ఎగ్జిబిషన్ ప్రతినిధి సంజయ్ సూచించారు.

మధ్యవర్తిత్వంతో ఇరుపక్షాలకు న్యాయం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జి.శివ ప్రసాద్ యాదవ్

అనంతపురం: మధ్యవర్తిత్వంతో ఇరు పక్షాలకు న్యాయం జరుగుతుందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శివ ప్రసాద్ యాదవ్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా కోర్టు ప్రాంగణంలో ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన 33 మంది అడ్వకేట్స్‌కు మీడియేషన్ అంశంపై 40 గంటల పాటు శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. రీసోర్స్ పర్సన్స్ బృందా కుమార్ (సీనియర్ ట్రైనర్, బెంగళూరు), కుమార్ (పొటెన్షియల్ ట్రైనర్) వివిధ అంశాలపై న్యాయవాదులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.గురుప్రసాద్ పాల్గొన్నారు.

'చివరికి న్యాయమే గెలుస్తుంది'

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం విద్యారణ్య నగర్‌లోని 68 సెంట్లలో భవనాల కూల్చివేతపై హైకోర్టు స్టేటస్‌కో ఇవ్వడం హర్షణీయమని జిల్లా రిటైర్డ్ జడ్జి కిష్టప్ప అన్నారు. సోమవారం సాయంత్రం 68 సెంట్ల స్థలాన్ని పరిశీలించిన ఆయన బాధితులతో మాట్లాడారు. కోర్టు స్టేటస్‌కో ఇవ్వడంతో ఈ స్థలాన్ని ఎవరూ అన్యాక్రాంతం చేయకూడదని.. యథాస్థితిలోనే ఉండాలని స్పష్టం చేశారు. తొలిగించాలంటూ ఇదే రకమైన ఉత్తర్వులను గత ప్రభుత్వ హయాంలోనే కోర్టు ఇచ్చిందన్నారు. అప్పట్లో పేదలకు నష్టం కలగకుండా కాపాడారన్నారు. అప్పుడు కాపాడిన అధికారులే ఈరోజు ఆ బాధ్యత తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. ఏది ఏమైనా కోర్టు తీర్పు రావడం హర్షణీయమని తెలిపారు. ఇందులో మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి కృషి అభినందనీయమన్నారు.

హుండీ కానుకల లెక్కింపు

అనంతపురం కల్చరల్: మొదటి రోడ్డు కాశీవిశ్వేర కోదండ రామాలయ హుండీ కానుకలను సోమవారం ఎండోమెంటు అధికారుల సమక్షంలో లెక్కించారు. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వన్నూరు స్వామి మాట్లాడుతూ.. ఈసారి హుండీ ఆదాయం రూ.8,02,753 వచ్చిందన్నారు. గతంలో కంటే రూ.68,232 ఆదాయం పెరిగిందని వెల్లడించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ శోభ, అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

అనంతపురం క్రైం: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో సోమవారం వెంకటనాయుడు అనే దాత సహకారంతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మేనేజర్ మూర్తి ప్రారంభించారు. ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో ప్రయాణికుల సౌకర్యార్థం చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు దాత తెలిపారు.

33 మంది గైర్హాజరు

రాప్తాడు: మండలంలోని నాలుగు సెంటర్లలో సోమవారం జరిగిన పదో తరగతి గణితం పరీక్షకు 33 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఎంఈఓ మల్లికార్జున పేర్కొన్నారు. మొత్తం 1,089 మంది హాజరు కావాల్సి ఉండగా.. 1,056 మంది హాజరైనట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద సీఐ శ్రీహర్ష ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు చేపట్టారు.

నేడు పాండురంగడి స్పర్శదర్శనం

అనంతపురం కల్చరల్: భావసారక్షత్రియ సమాజ్ ఆధ్వర్యంలో రామనగర్‌లో వెలసిన రుక్మిణీ పాండురంగ విఠల స్వామి ఆలయంలో మంగళవారం పాపవిమోచన ఏకాదశి వేడుకలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు ఆనంద్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈసారి ప్రత్యేకంగా ఉదయం 6:30 గంటల నుంచే వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. 8 గంటలకు రుక్మిణీ పాండురంగస్వామి స్పర్శదర్శనం ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ఆత్మకూరు: స్థానిక కస్తూర్బా పాఠశాలలో 6వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ లీమారోజ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 11వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఉత్తమ ఉపాధ్యాయురాలిగా మలికజాన్



ప్రశంసాపత్రం, అవార్డు అందుకుంటున్న ఇంగ్లిష్ టీచర్ మలికజాన్

అనంతపురం ఎడ్యుకేషన్: తెలంగాణకు చెందిన 'సర్వేజనో సుఖినోభవంతు' సంస్థ 8వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ప్రకటించిన సావిత్రిబాయి పూలే ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు నగరంలోని కస్తూర్బా నగరపాలక ఉన్నత పాఠశాల ఇంగ్లిష్ టీచర్ ఎస్.మలికజాన్ ఎంపికయ్యారు. రెండు రోజుల క్రితం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమలో తెలంగాణ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రయ్య చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. పలువురు మహిళలు ఉపాధ్యాయ రంగంలో విశిష్ట సేవలందిస్తుంటడం చాలా సంతోషించదగ్గ అంశం అని చంద్రయ్య పేర్కొన్నారు. కార్యక్రమంలో కేంద్ర సెన్సార్ బోర్డు సభ్యులు మందడి కష్టారెడ్డి, కేంద్ర నాటక మండలి చైర్‌పర్సన్ భారతి, సరస్వతి ఉపన్యాసకులు దైవజ్ఞ శర్మ పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి నియాజ్ ఆధ్వర్యంలో సోమవారం రాంనగర్‌లోని సీపీఎస్ పెట్రోల్ బంక్ ఆవరణలో వందల సంఖ్యలో నిరుపేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత అనంత చంద్రారెడ్డి హాజరైయ్యారు. సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని కొనియాడారు.